# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **రెవిన్యూ శాఖపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నారు.**

**2.** **ఆగస్టు నెల పింఛన్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రీసత్యసాయి జిల్లాలో పంపిణీ చేయనున్నారని రాష్ట్ర జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు.**

**3.** **టిడ్కో గృహాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4.** **ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో రాష్ట్రంలో జలాశయాలకు వరద ప్రవాహం కొనసాగుతోంది.**

**5.** **ప్రత్యేక లోక్ అదాలత్ వారోత్సవాలు ఈరోజు నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సుప్రీంకోర్టు నిర్వహించనుంది.**

==========================

అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెవిన్యూ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర రెవిన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా హాజరైయ్యారు. గత ప్రభుత్వం హయాంలో భూ కేటాయింపులు, మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో అగ్ని ప్రమాద ఘటన వంటి అంశాలపై సమీక్ష నిర్వహిస్తున్నారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

-------------------------

శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఆగస్టు 1వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించనున్నారని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్. సవిత వెల్లడించారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను మంత్రులు పయ్యావుల కేశవ్, వై.సత్యకుమార్‌లతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్.సవిత మాట్లాడుతూ, జిల్లాలోని గుండుమల గ్రామంలో పింఛన్ల పంపిణీలో భాగంగా పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్ళి ముఖ్యమంత్రి నగదును అందజేయనున్నారని చెప్పారు. పింఛన్ల పంపిణీ అనంతరం గ్రామంలోనే రచ్చబండ కార్యక్రమం నిర్వహించనున్నారని ఇందుకు సంబందించిన ఏర్పాట్లను జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం పూర్తి చేస్తోందని మంత్రి తెలిపారు.

-------------------------

టిడ్కో గృహాలలో అన్ని విధాలైన మౌలిక వసతులు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతి రాజధాని గ్రామాల్లోని నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లు, మౌలిక వసతులను మంత్రి ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వంద శాతం మేర ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. టిడ్కో గృహాలకు తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయం, రహదారులు వంటి అన్ని వసతులను మరో మూడు నెలల్లో కల్పిస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

"ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15వ తేదీన 15 లక్షల మొక్కలు నాటనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమ ప్రచారంలో భాగంగా, భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ –డీఆర్‌డీఓ, రక్షణ పీఎస్యూలు, సీజీడీఏ, ఎన్సీసీ, సైనిక పాఠశాలలు వంటి అనుబంధ సంస్థల ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది.

---------------------------

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఈరోజు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి ధరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలతో పాటు వివిధ సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని.. సంబంధిత అధికారులతో వాటిని పరిష్కరిసరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. మరోవైపు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు నిర్వహించన మీకోసం – ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.అర్జీలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని అర్జీదారుల సమస్యలను సానుకూలంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

---------------------------

ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో రాష్ట్రంలో జలాశయాలకు వరద ప్రవాహం కొనసాగుతోంది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధవళేశ్వరం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. బ్యారేజీ వద్ద నీటిమట్టం 15.40 అడుగులుగా ఉంది. 15 లక్షల 42 వేల 588 క్యూసెక్కుల జలాలు అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. గోదావరి వరదతో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాలు వరద ముంపులో ఉన్నాయని అధికారులు తెలిపారు. మరోవైపు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు చేరుతోంది.జూరాల, సుంకేశుల ప్రాజెక్టుల నుంచి 4.36 లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చిచేరుతోంది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 215.8 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటినిల్వ 171.86 టీఎంసీలుగా నమోదైంది.నీటి విడుదల ద్వారా శ్రీశైలం కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తున్నారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన చట్టాలతో నేరాలను మరింతగా నియంత్రించవచ్చునని నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. నూతన నేర చట్టాలపై పోలీసు అధికారులకు నంద్యాలలోని స్థానిక

కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో కేంద్ర ప్రభుత్వం భారతీయ న్యాయ సంహితను ప్రవేశపెట్టిందన్నారు. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ స్థానంలో భారతీయ నాగరిక్ సురక్ష సంహితను, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ స్థానంలో భారతీయ సాక్ష అధినీయంను నూతనంగా అమలు చేసిందని వివరించారు. మహిళలు, చిన్న పిల్లలపై జరిగే నేరాలకు అమలు చేసే శిక్షలపై పోలీసులు అవగాహన కలిగివుండాలని తెలిపారు.

---------------------------

పౌరులకు సాధ్యమైనంత సరళంగా, త్వరితగతిన న్యాయం అందించడమే లోక్ అదాలత్‌ల లక్ష్యమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి హృషికేష్ రాయ్ తెలిపారు. దేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈరోజు నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సుప్రీంకోర్టు ప్రత్యేక లోక్ అదాలత్ వారోత్సవాలను నిర్వహించనుందని ఆయన తెలిపారు. లోక్ అదాలత్‌లు ప్రజా న్యాయస్థానాలు అని తక్కువ ఖర్చుతో, అందరికీ అందుబాటులో ఉండే విధంగా సత్వరమైన సమర్థవంతమైన న్యాయాన్ని అందిస్తున్నాయన్నారు . లోక్ అదాలత్ల ద్వారా వెలువడే తీర్పులే అంతిమమని న్యాయస్థానాల్లో అప్పీలు చేయడం గానీ, సవాలు చేయడం గానీ వీలుండదని తెలిపారు.

---------------------------

గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు వీఆర్ కృష్ణతేజ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లాలోని పిఠాపురం మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో నిన్న జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారులు, సర్పంచులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రణాళిక తయారు చేసి పంపితే నిధులు మంజూరు చేస్తామన్నారు. నిధులు వినియోగంలో అక్రమాలు, నిర్మాణాల్లో నాణ్యత లోపాలు ఉంటే చర్యలుంటాయని హెచ్చరించారు.

---------------------------

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం రుస్తుంబాదలోని లేసు పార్కుకు భౌగోళిక గుర్తింపు – జీఐ ట్యాగ్ లబించిందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎంఎస్ఎస్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. దుస్తుల డిజైన్లకు ఉపయోగించే లేసు అల్లికలు ప్రత్యేక శైలిని కలిగి ఉండటంతో ఈ గుర్తింపు లభించిందన్నారు. ఉభయగోదావరి జిల్లాలోని మహిళల సాధికారతకు కేంద్రప్రభుత్వ సహకారంతో 2000లో లేసు పార్కు ఏర్పాటు చేశారని, అప్పటినుంచి ఇక్కడ మహిళలకు మార్కెట్ అవసరాలకు అను గుణంగా లేసు అల్లికల్లో తర్ఫీదిస్తున్నారని చెప్పారు. లేసు పార్కుకు భౌగోళిక గుర్తింపు రావడం శుభపరిణామమని తద్వారా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

రహదారి ప్రమాదాల నివారణకు రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా ఉపరవాణా కమీషనర్ ఏ. చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఈరోజు శ్రీకాకుళంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మోటారు వాహనాల చట్టం సమర్ధవంతంగా అమలు చేస్తూ వాహన చోదకులకు పారదర్శకంగా లైసెన్సులు అందిస్తున్నామన్నారు. ఎచ్చెర్లలో మూడు కోట్ల రూపాయలతో డ్రైవింగ్

ట్రాక్ నిర్మిస్తున్నామని చెప్పారు. పోలీస్ రవాణా శాఖల మధ్య సమన్వయంతో రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 27 సెకన్లు....

---------------------------

పారిస్ ఒలంపిక్స్‌లో మూడవ రోజు జరిగే క్రీడా పోటీల్లో షూటింగ్, హాకీ, బ్యాడ్మింటన్, ఆర్చరీ, టెబుల్ టెన్నిస్ విభాగాల్లో భారత క్రీడాకారులు పోటీ పడనున్నారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో రమితా జిందాల్, పురుషుల విభాగంలో అర్జున్ బబుతా పోటీ పడనున్నారు. వీరితో పాటు హాకీలో భారతజట్టు అర్జెంటీనా జట్టుతో పోటీ పడనుంది. బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో గ్రూప్ ఎల్ మ్యాచ్‌లో ఇండియన్ షెట్లర్ లక్ష్య సేన్ బెల్జియన్ షెట్లర్ జూలియన్ కరాగేతో పోటీ పడనున్నారు. ఆర్చరీలో పురుషుల బృందం క్వార్టర్ ఫైనల్‌లో పోటీ పడనుండగా, టెబుల్ టెన్నిస్‌లో మహిళా సింగిల్స్ లో మనికా బాత్రా, ఫ్రెంచ్ క్రీడాకారిణి ప్రితికా పవాడేతో పోటీ పడనుంది.

---------------------------

బాపట్ల జిల్లా చీరాలలోని సముద్ర తీరంలో పర్యాటకుల భద్రతకు చర్యలు చేపడుతున్నామని చీరాల శాసన సభ్యులు కొండయ్య తెలిపారు. చీరాలలోని వాడరేవు, రామాపురం తదితర సముద్ర తీరా ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ, పర్యాటకులు సముద్రం ప్రమాద ఘటనలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయని, ఈ క్రమంలో కటారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం తీరప్రాంతంలో ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నామని చెప్పారు.

======================